సుప్రసిద్ధ తత్త్వవేత్త

# ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి

తెలుగు రచనల సంకలనం

**సంపుటి–1**

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఈశోపనిషత్తు – వివరణతో | 5–64 |
| 2. | ఋగ్వేద ఆంధ్ర వివృతి – ఉపోద్ఘాతం | 65–84 |
| 3. | మనిషి – ముక్తి | 85–164 |
| 4. | రామానుజ దర్శనము | 165–196 |
| 5. | దివ్య జీవితము | 197–238 |
| 6. | కారు మబ్బులు | 239–308 |
| 7. | ప్రమాణ పద్ధతిపై ప్రసంగము– రెనె డెకార్ట్ ప్రణీతము | 309–424 |

# ఉపనిషత్తులు

**శ్రు**తి శిరస్సీమంతముక్తామణు లుపనిషత్తులు, సనాతనధర్మ మూలములు పనిషత్తులు. నిర్విశేష బ్రహ్మజ్ఞాననిధు లుపనిషత్తులు,

సనాతనధర్మపుమూలము వేదమని సర్వజనవిదితము. కాని తన్మూలపు స్వరూపరహస్యముల నెఱిగినవారు కొలది మంది. తదితరులు, శాఖాగ్రపతితములగు ఒకటి రెండు సుస్వాదములగు రుచిర నశ్వర ఫలములనే ఆస్వాదించుచున్నారు. వేదమున కర్మకాండ, జ్ఞానకాండ – అని రెండు భాగములు కలవనియు, మనము వినియున్నాము. లేక మేక్సముల్లర్ యొక్క ఋగ్వేదవ్యాఖ్యనో, లేక ప్రొఫెసర్ దత్త యొక్క అనువాదములనో చదివి యుందుము. కాని మనకు ఋగ్వేదమన నేమో తెలియదు – ఉపనిషత్తులన నేమో అంతకు ముందే తెలియదు. ఇట్టి అనువాదముల జదివియే వేదకాలపు ఋషులు చెట్లు చేమలను, అగ్నివాయువులను, నదీపర్వతములను పూజించెడి వారనియు, ఈ భౌతికపదార్థముల ప్రశంసయే ఋగ్వేదపు సూక్తముల విషయమనియు మనము నేర్చుకొని బోవుచున్నాము. దీనిని విశ్వసించియే, మనము ప్రాచీన ఋషులను, సనాతనధర్మమును అవమానించి జ్ఞానులమని విఱ్ఱవీగుచున్నాము. ఉపనిషత్తులనగనే, మనకు శంకరుల అద్వైతవాదము, లేక మధ్వుల ద్వైతవాదము మున్నగునవి స్ఫురించుచున్నవి. కాని అసలుపనిషత్తులం దేమి గలదో, వాని నిజార్థ మెయ్యదో, పరస్పరవిరోధములు గల షడ్దర్శనము లా ఏకమూలము నుండి యెట్లుద్భవిల్లినవో, వాని కతీతమగు జ్ఞాన మేదేని వాని యందు లభ్యమగునేమో మనము వివేచించుటయే లేదు. సాంప్రదాయికాగ్రహమును హృదయమందుంచిన వారమై, శంకరులు చెప్పినదే, ఉపనిషత్తులయందు గలదు, రామానుజులు చెప్పినదే కలదు అను వృథా భ్రాంతులకు లోనగు చున్నాము. తథాపి, వాని యందు కేవల శంకర లబ్ధజ్ఞానము గాని, కేవల మధ్వ లబ్ధజ్ఞానము మాత్రమే గాని లేదు. త్రికాలములందు, ఏ తత్త్వజ్ఞానము లభించినదో, లభింపగలదో, తత్సర్వమును ఆర్యఋషులు, యోగమార్గమున

# ఋగ్వేద ఆంధ్ర వివృతి : ఉపోద్ఘాతం

## వేదమహిమ

“పితృ, దేవ, మనుష్యులకు వేదం సనాతనమైన చక్షువు. వేదశాస్త్రం అశక్యం, అప్రమేయమున్ను. చాతుర్వర్ణ్యం, మూడు లోకాలు, నాలుగు ఆశ్రమాలు, భూతం, భవ్యం, భవిష్యం ... అన్నీ వేదం నుండే ప్రసిద్ధమౌతాయి. సనాతనమైన వేదశాస్త్రం సర్వభూతాలను భరిస్తుంది. అందుచేత దీనిసాధన జీవికి అతిముఖ్యమని తలుస్తాను. వేదశాస్త్రార్థతత్త్వజ్ఞుడు బ్రహ్మభూతుడౌతాడు. వేదశాస్త్రవేత్త సర్వలోకాధిపత్యానికి అర్హుడు.” ఈవిధంగా వేదాన్ని స్తుతించింది ధర్మశాస్త్రసాహిత్యంలోకెల్ల ప్రాచీనమైన, శిరోమాణిక్యమైన మనుస్మృతి. అంటే శుంగకాలం (2 నుండి 1వ శతాబ్దం క్రీ.పూ.) నాటికే వేదానికి ఇంతటి మహిమ ఉన్నట్టుగా విశ్వసింపబడింది. అంతకు పూర్వమే ఉద్భవించిన సూత్రసాహిత్యంలో కూడా (అంటే కనీసం క్రీ.పూ. 500 నాటికే) వేదం పరమప్రామాణికమైన, అత్యంతపవిత్రమైన, మహామహిమాన్వితమైన. అభ్యుదయ నిశ్శ్రేయసాలను గురించి సాధికారంగా చెప్పే ఏకైకశాస్త్రంగా పేర్కొనబడింది. నేటికిన్ని ఆస్తికులు, శ్రద్ధాళువులు, సంప్రదాయబద్ధులు అయిన హిందువులందరికి వేదాన్ని గూర్చి ఇటువంటి భావనే ఉంది.

## వేదనిర్వచనం

ఇష్టప్రాప్తి, అనిష్టపరిహారముల అలౌకికమైన ఉపాయాన్ని ఏ గ్రంథం తెలుపుతుందో అది వేదమని, సాయణాచార్యులు కృష్ణయజుర్వేదానికి చెందిన తైత్తిరీయ సంహితాభాష్యభూమికలో వ్రాశారు. ఆయనే అలౌకికమైన పురుషార్థోపాయం దీనిచే (మానవుడు) తెలిసికొనును అని వేదశబ్ద నిర్వచనమని ఋగ్వేదభాష్యోపక్రమణికలో వ్రాశారు (అలౌకికం పురుషార్థోపాయం వేత్తి అనేన ఇతి వేదశబ్ద నిర్వచనమ్). దీన్ని బట్టి అలౌకికోపాయ బోధకత్వమే వేదత్వమని తేలుతుంది. ప్రత్యక్షం చేత, అనుమానంచేత, ఏ ఉపాయం తెలియబడదో, దాన్ని వేదంచే తెలుసుకొంటారు. అందువలననే వేదమునకు వేదత, – అని ప్రాచీనాచార్యులు చెప్పిన దానినే సాయణాచార్యులు అనువదించారు:

# అతి భౌతిక శాస్త్రం – ఆవశ్యకత

**నే**డు చాల దేశాలు అతిభౌతిక శాస్త్ర విరుద్ధ యుగంలో వున్నాయి. భాషా విశ్లేషణమే దర్శనశాస్త్ర ప్రయోజనమని కొందరు భావిస్తుండగా, అది ఒక రకమైన ఆత్మకథ అనిగాని, వర్ణనాత్మక మనస్తత్త్వ శాస్త్రమని గాని మరికొందరంటున్నారు. ఈ సందిగ్ధ పరిస్థితులలో సంప్రదాయవాదులు (వీరిలో ముఖ్యులు థామిస్టులు, వేదాంతులు) తరచు మృతప్రాయమైన అతిభౌతిక శాస్త్రావలంబకులుగా కనబడుతున్నారు.

ఇప్పుడీ శాస్త్రాన్ని గూర్చి నేను ప్రశస్తి వాక్యాలు పలికితే, ఆంగ్లోశాగ్జను దేశాలలోని విద్యాలయాలలోని దార్శనికులు, వారి ప్రభావానికి లోనైన వారు (మన దేశంలోనూ వీరు చాలామందే వున్నారు) నన్ను దార్శనిక శాస్త్రపు శిలాయుగం నుంచి ఊడిపడినట్టు భావింపవచ్చు. ఇట్టి వితర్కవాదుల, నాస్తికుల, సంశయవాదుల దురాగ్రహానికి గురియైనా, నేను నేటి యుగంలో అతిభౌతిక శాస్త్రావశ్యకతను విశదీకరించ యత్నిస్తాను.

అతి భౌతికశాస్త్రానికి మూడు విధాలైన ఆవశ్యకత వుంది 1. బుద్ధి విషయికం, 2. భాషా విషయికం. 3. మనశ్శాస్త్ర విషయికం.

1. జీవితంలో ఐక్యసాధన లక్ష్యం లేకపోవడం చేత నవీన ప్రపంచం శ్రద్ధాభ్రంశ మనే పెద్ద ప్రమాదానికి గురియైనట్లగపడుతున్నది. ఐరోపీయ నాగరికతలో హెలెనిక్, రోమను యుగాల మేధావులు ప్రాథమిక పూర్వభావాలను ( basic presuppositions) గూర్చి ప్రశ్నించకుండానే వారి జీవితాలు గడిపారు. సాంప్రదాయిక (క్లాసికల్) యుగంలో కూడా వితర్కవాదులున్నా, వారు ప్రాథమిక విశ్వాసాలను, ఆచారాలను, అణగద్రొక్క యత్నించలేదు. వారిలో సోక్రటీసు ముఖ్యుడు. అతడు ప్రాథమిక పూర్వ భావాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని వెలుగులోనికి తేవడానికి ప్రయత్నించాడు. కాని అతడు గ్రీకు జీవన విధానాన్ని ఋజుబుద్ధితో అవలంబించాడు; తన మరణ సమయంలో కూడా ఏస్ క్లీపియస్‌కు యివ్వవలసిన కోడిని ఇవ్వమని క్రిటోను కోరాడు. ప్రాచీన సంస్కృతులన్నిటిలో హీబ్రూ సంస్కృతి ఎక్కువ సంశ్లిష్టమైనది. జెహోవా, ధర్మం,

# రామానుజ దర్శనము

**ఋ**గ్వేదమందు విష్ణువు సర్వవ్యాపి గాను సర్వోత్కృష్ట లోకమందు తావుగల వాడు గాను వర్ణింపబడినాడు. అట్లే వరుణదేవుని స్వభావ స్వరూప మహిమల వర్ణించుటలో ఆయనను పరమేశ్వరునిగా చెప్పినారు. కాక వేదములందు శుభముల ననుగ్రహించు భగుడను దేవుడు వర్ణించబడినాడు. భగమనగా ఐశ్వర్యమనియు, అది గలవాడు భగవంతుడనియు తరువాతననిరి. భగవంతుని ఆరాధించు మతము భాగవత మతము. మహాభారతమందు భాగవత మతము అభివర్ణితము. వైష్ణవము భాగవత మతము నుండి వచ్చినట్టిది. ఇందు విష్ణువు భగవంతుడుగా చెప్పబడినాడు. పాంచరాత్ర సిద్ధాంతములు వైష్ణవమునకు మూలకందము. ఇవి అతిప్రాచీనములు, వీటి సారాంశము ఋగ్వేదమందలి పురుషసూక్త మందే కన్పడును. ఇటులనే శతపథబ్రాహ్మణ మందు కూడ పరమపురుషుడగు నారాయణుడు సర్వోత్తముడని చెప్పబడినది. భారతస్థ శాంతిపర్వమందు ఈ మతప్రసంగ మున్నది. పాంచరాత్ర ఆగమములలో జయాఖ్య, విష్ణు, సాత్వత, ఆహిర్బుధ్న్య సంహితలు ముఖ్యములు. ఇంకను ఎన్నో వున్నవి. కూర్మాది కొన్ని పురాణములందు, సూత వశిష్ఠ సంహితలు మున్నగు గ్రంథములందు పాంచరాత్రములు అవైదికములని, పాపిష్ఠములని చెప్పబడినవి. కాని శ్రీమద్భాగవతమందు, మహాభారతమందు, విష్ణు పురాణమందు అవి ప్రశంసించబడినవి. అట్లే విష్ణు, హారీత, వ్యాస, పారాశర, కాశ్యపస్మృతులు పాంచరాత్రమును కొనియాడినవి. వైష్ణవులకు పాంచరాత్రము వేదమంతటి ప్రామాణికము. సాంఖ్యయోగకృతాంతముతో పాటు పాంచరాత్రము కూడ వేదమునకు సహకారియని వ్యాసుడు చెప్పినట్లుగా వేదాంతదేశికులు ప్రమాణము నుదాహృతము చేసినారు.

**ఇదం మహోప నిషదం చతుర్వేద సమన్వితమ్ ।**
**సాంఖ్యయోగకృతాంతేన పంచరాత్రాను శబ్దితమ్ ॥** (సేశ్వర మీమాంస)

# దివ్యమతము : లోకము

ప్రచలితాభిప్రాయమునకు వ్యతిరేకముగ నుండు వాక్యమును ప్రతిపాదించునది తర్కము. ప్రథమ పరిశీలనమున విపరీతముగ దోచియు, యత్కించిదాలోచన విశ్లేషణ చేసినయంతనే సాధారణ బుద్ధికి గూడ నచ్చునట్టి సత్యమందుండును. అనుదిన వ్యావహారిత భాషయందుగాని, విచారణ యందుగాని సాధారణముగ వాడబడనట్టి శబ్దజాలమునో, ఆలోచనాపరంపరలనో ప్రతిభాయుతమైన వింత విధమున వినియోగించుటవలన ఇది సాధ్యపడుచున్నది.

వర్తమానోద్దేశ్యముల కాధారభూతములైన సూత్రములు, బుద్ధిపూర్వకమైన భావముల ఏతాదృశ వ్యవస్థచే అస్తవ్యస్తము లగుచున్నవి. ప్రచలితాభిప్రాయ మందలి అసత్యము నగ్నముగ ప్రదర్శింపబడినంతనే, తర్కముద్వారా వక్త వ్యక్తీకరించదలచిన సత్యము ప్రతిష్ఠింప బడుచున్నది. తర్కము నానావిధములు. విమర్శనబుద్ధిరహితుల మనస్సుల కనివార్యముగ దోచు అర్థముగల ప్రతిజ్ఞా వాక్యమునుండి అనుకోనట్టి నూతన నిగమనమును లాగుట యొకతెఱగు.

ఈ మధ్య స్పెయినునందు సంభవించిన గంద్రగోళముల గూర్చి మాటలాడు చున్న యొక ప్రచారకుడు కేతలిక్ దేశములందు గూడ అపవాదము లేకుండ కేతలిక్ మతముపై రేగిన విశ్వవ్యాప్తమయిన విప్లవమును, తదనుయాయులుగూడ సాగించిన ప్రతిఘటనలను స్పేనిష్ అల్లరులందు ప్రతిబింబించినట్లు చూచినవాడై – అనేకమంది మనుష్యులందు ఇంతటి తీవ్రమైన ఉద్రేకపూర్వకమైన వైషమ్యమును పుట్టింపజాలిన సంస్థ యెంతయో దుష్టభూయిష్ఠమై యుండుట యందు సందేహముండదు, అని బాహాటముగ ఘోషించెను. ఈ తర్కమున కాధారభూతమైన ప్రతిజ్ఞావాక్యమునందు ఆతడు తీసినదానికి కేవలము విరుద్ధమైన నిర్ణయము దాగియున్నది. మానవులందు నిరపవాదముగ నింతటి విషమత్వమును కలిగించిన దానిలో మానవాతీతమైన పదార్థము దాగియుండుట నిశ్చయము.

భగవంతు డసహ్యించుకొను దానిలో శ్రేయస్సుండుట కల్ల : అది నిక్కము. సంస్కృతియందు, అభిప్రాయములందు, ఆచారవిచారములందు భిన్నరుచులు

| | | |
|---|---|---|
| 1. | వెతుకులాట | 243 |
| 2. | ఏం చేయాలి? | 246 |
| 3. | అభ్యుదయం | 249 |
| 4. | మార్క్సిజం | 252 |
| 5. | అనాథ | 257 |
| 6. | భావసంగ్రామం | 270 |
| 7. | నేటి సమస్య | 288 |
| 8. | కారు మబ్బులు – తొలగాలి | 301 |

# వెతుకులాట

**మొ**న్న నాల్గురోజులనాడు మధ్యాహ్నభోజనం అయినాక నట్టింట కూర్చున్నాను, తమలపాకులు నములుతూ. ఉత్తరపు కిటికీల ప్రక్కనున్న గులాబి గుబుర్లనుంచి గాలి హాయిమని కొట్తావుంది. ఆ దినం కోడిని కోసి కూర వండారు. చాలా బాగా కుదిరింది.

అంతా బాగానేవుంది. లేమి అనేది లేకుండా జరుగుతూంది సంసారం. చదవవలసినదంతా చదివేను. అయినప్పటికీ నా కప్పుడప్పుడు ఏదో ఒక అవ్యక్త వ్యథ, ఒక అజ్ఞాతబాధ కల్గుతూ వుంటుంది. జీవితంలో ఏమిటి తక్కువా, అని వివరించాను. నాకు లేని లోటు ఏమా అని ఆలోచించాను, కాని నా హృదయం యొక్క లోపలి లోతులు ఏం కావాలని ఆక్రోశిస్తున్నయ్యో, ఏది దొఱకటం వల్ల నా తనివి తీరుతుందో నాకు మాత్రం అర్థం కాలేదు. ఈ ఉత్కంఠ, ఈ ఇచ్ఛ నాకు ఒంటరిగా ఉన్నప్పుడే కాదు కల్గుతుంది. ఒక్కొక్కసారి క్లాసులో బి.ఏ. చదివేవాళ్ళకు లెక్చరిస్తుంటే కల్గుతుంది. ఒక్కొక్కసారి సాయంకాలం కొండలవైపు తోటలవైపు షికారు వెళ్ళినప్పుడు కల్గుతుంది. కొన్నిసార్లు క్లబ్బుల్లో వున్నప్పుడూ, స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడూ కల్గుతుంది. సమయం, అసమయం లేకుండా హఠాత్తుగా అనేకసార్లు జీవితంలో ఏదో ఒక గొప్ప లోటు వున్నట్టూ అది పూర్తికాని బ్రతుకు శూన్యంగాను కన్పడింది.

ఈ లేనిది, ఈ కావాల్సింది ఏమా అని ఆలోచించాను. విచారపరంపరల నన్నింటినీ విశ్లేషణ (analyze) చేశాను. నాకు మాత్రం బోధపడలేదు అసలు సంగతి.

ఎవరి కర్తవ్యం వాళ్ళు చేసుకుంటూ ఒకరికి అపకారం చేయకుండా నీతిగా బ్రతకటమే సుఖము అని చెప్పగా విన్నాను. మరి నేను కర్తవ్యం చేస్తూనే వున్నాను. ఒకరికి హాని చేయటం లేదు. నీతిగానే వుంటున్నాను. అయినా నాకు సుఖం కల్గటం లేదు. కారణం? మోటారుకారు వుంది. అది ఎవరికీ హాని చేయటంలేదు. దానికి తగిన ఆహారం (పెట్రోలు) దొఱికినంత వరకు అది తన కర్తవ్యం తాను చేస్తూనే వుంది. రైస్ మిల్లు వుంది. అదిన్ని దానికి శక్తి వున్నవరకు వడ్లను బియ్యంగా మారుస్తూ తన

# ఉపోద్ఘాతము
# డెకార్ట్ జీవితము, కృషి

కె. సచ్చిదానందమూర్తి

## జన్మాదులు:

ఫ్రాన్సు దేశపు టురేన్ ప్రాంతమందలి లహెలో 31 మార్చి, 1596 న రెనె డెకార్ట్ జన్మించెను. ఆయన తండ్రి జోయాకిం బ్రిటాని లోక్‌సభలో (1585–6) సదస్యుడు; తాత పియరె వైద్యుడు. రెనె తల్లిదండ్రులకు రెండవకుమారుడు; రెనె ఆయన మేనమామ పేరు. డెకార్ట్ కుటుంబనామము. వారు మధ్యతరగతి భూస్వాములు. జోయాకిం తదనంతరము ఆయన సంతానము ఆతని పుష్కల సంపత్తికి వారసులైరి; కాబట్టి రెనె డెకార్ట్ లేమి అనునది ఎఱుగకుండ స్వతంత్రముగ జీవించుట సాధ్యపడెను. ఏడాదికి ఆయనకు ఆరేడువేల ఫ్రాంకుల ఆదాయము వచ్చెడిది.

లాటిన్ భాషలో ఆయన పేరు రెనాటస్ కార్టీసియస్, అందుమూలముగానే ఆయన తదుపరి స్థాపించిన దార్శనిక వాదము కార్టీషియన్ మతమని పిలువబడెను.

## విద్యాభ్యాసము :

తన 10 వ ఏట డెకార్ట్ 4 వ హెన్రీ రాజుచే స్థాపింప బడిన లఫ్లెచ్ లోని ఏసుసభ (Society of Jesus) వారు స్థాపించిన విద్యాలయములో తొమ్మిదేండ్లు విద్యాభ్యాసము చేసెను. ఆ కాలమందు ఏసుసభ వారి విద్యాలయములలో ఆరేండ్లు మానవీయ శాస్త్రములు (Humanities), మూడేండ్లు దర్శన శాస్త్రమును బోధించెడివారు. ఆ మూడేండ్లలో, మొదటి సంవత్సరము నీతి తర్కశాస్త్రములు, రెండవ సంవత్సరము గణిత భౌతిక శాస్త్రములు, మూడవ సంవత్సరము తత్త్వశాస్త్రము బోధించెడివారు. మూడేండ్ల లోను ఒకేగురువు ఉండెడివాడు. డెకార్ట్ గురువు ఫోర్నెత్. 1614లో డెకార్ట్ అచట విద్యాభ్యాసము పూర్తిచేసి పొయిటియర్ విశ్వవిద్యాలయములో చేరి, అచట అధ్యయనానంతరము నవంబరు 1616 లో న్యాయశాస్త్ర పట్టభద్రుడాయెను.